క్లుప్తంగా

ప్రొ. కోదండరామ్‌కు అభినందన



సన్మానిస్తున్న నరసయ్య, శ్రీనివాస్, రవీందర్

చిక్కడపల్లి: తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రొఫెసర్ కోదండరామ్ మూడోసారి ఎన్నిక కావడంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ.. సోమవారం ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. నగర అధ్యక్షుడు ఎం.నరసయ్య ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ కన్వీనర్ గుండెల్లి రవీందర్‌యాదవ్‌లు కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. యూత్‌వింగ్ నేత మహేష్, సంపత్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



పనులను పర్యవేక్షిస్తున్న ఎర్ర భీష్మదేవ్

కాచిగూడ: స్థానిక ప్రజలు, వాహనదారుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన సొంత నిధులతో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారని ఎర్ర భీష్మదేవ్ అన్నారు. బర్కత్‌పుర రాఘవేంద్ర హోటల్ లేన్, బస్‌డిపో రోడ్డు, రాజేంద్రనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశామని కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు భీష్మదేవ్ తెలిపారు.

హనుమాన్ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు



ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలయ చైర్మన్ రవీందర్ తదితరులు

కవాడిగూడ: దోమలగూడ అడ్వొకేట్ కాలనీలోని బాలత్రిపుర సందరీదేవి ఆలయం, పంచముఖి హనుమాన్ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ చైర్మన్ దోమలగూడ మాజీ కార్పొరేటర్ రవీందర్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు, గణపతి హోమం, చండీహోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. యువజన నాయకుడు ముఠా జైసింహ, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, శ్యామ్‌లాల్, శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌ముదిరాజ్, వై.శ్రీనివాస్, ఆలయ అర్చకులు హరిశర్మ, శుక్లా, శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లో జోరుగా అడ్మిషన్లు !



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థులు

ముషీరాబాద్: ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని ఏడు ఉన్నత పాఠశాలలు, 23 ప్రాథమిక పాఠశాలలతో పాటు ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు సైతం ప్రారంభం కావడంతో పాఠశాలల పరిసర ప్రాంతాలు విద్యార్థులతో సందడిగా మారాయి. సెలవుల అనంతరం సోమవారం పునఃప్రారంభమైన పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. సుమారు 45 రోజులకు పైగా సెలవుల అనంతరం తోటి స్నేహితులు కలవడంతో ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మొదటి రోజు ఆరోతరగతి, ఎనిమిదోతరగతి అడ్మిషన్లకు 11 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌యాదవ్‌ను కలిసి నూతనంగా అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా అడ్మిషన్లు తీసుకుంటున్నారని తెలిపారు.

సర్దుకుపోతే సమస్యలుండవ్



- చిన్న కారణాలతో భార్యాభర్తల్లో తగాదాలు
- కౌన్సిలింగ్‌తో 80 శాతం.. రాజీకుదిరినా 20 శాతం కేసులు
- వివాదాలకు తల్లిదండ్రులు సైతం కారణమవుతున్న వైనం
- నూతన ఈస్ట్‌జోన్ మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రేయతో ఇంటర్వ్యూ

పచ్చని కాపురాల్లో చిన్న చిన్న గొడవలు ఆగాధాన్ని సృష్టిస్తున్నాయి. జీవితంలో ఎన్నో ఆశలతో పెళ్లి చేసుకుని కొన్ని కారణాలతో వాటిని దూరం చేసుకుంటున్నారు. చిన్నపాటి కారణాలతో భార్యాభర్తలు పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. వారి సమస్య మూలాలు తెలిసి సర్దిచెప్పి పంపించేందుకు మహిళాపోలీసుస్టేషన్‌లలోని అధికారులు నిత్యం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. – అంబర్‌పేట



“నగరంలోని ఈస్ట్‌జోన్‌కు కొత్త అంబర్‌పేట్‌లో మహిళాపోలీసుస్టేషన్‌ను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు జూన్ 2న ఏర్పాటు చేశారు. ఈ పోలీస్ స్టేషన్‌కు మొదటి ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.శ్రేయ బాధ్యతలు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఆమెతో సోమవారం సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..”



సాక్షి: ఈస్ట్‌జోన్ మహిళా పోలీసుస్టేషన్ పరిధి ఎంత?

ఇన్‌స్పెక్టర్: ఈస్ట్‌జోన్ మహిళ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి 10 లాండ్ అర్డర్ పోలీస్ స్టేషన్లు వస్తాయి. అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, ఉస్మానియా యూనివర్సిటీ, అఫ్జల్‌గంజ్, సూల్తాన్‌బజార్, నారాయణగూడ, చిలకలగూడ, వారాసీగూడ, లాలాగూడ పోలీసు స్టేషన్లు ఉన్నాయి.

సాక్షి: రోజుకు ఎన్ని కేసులు వస్తున్నాయి? ఎన్ని రాజీ కుదురుతున్నాయి ?

ఇన్‌స్పెక్టర్: కొత్తగా పోలీసుస్టేషన్ ఎర్పడినప్పటి నుంచి రోజుకు 4 నుంచి 5 కేసులు వస్తున్నాయి. ఇందులో ఫిర్యాదు చేయకముందే రాజీపడిపోతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 20 కేసులు రాజీకి రాగా.. 5 కేసులను 498 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

సాక్షి: భార్య, భర్తలకు ఎలాంటి గొడవలు వస్తాయి? మీరు వారికి ఎలాంటి చేయుతనిస్తున్నారు.?

ఇన్‌స్పెక్టర్: గతంలో భార్యాభర్తల మధ్య గొడవలకు ఒకటి రెండు కారణాలు ఉండేవి. ప్రస్తుత గొడవలకు చాలా రకాల అంశాలు ఉంటున్నాయి. ఒకరిపై ఒకరికి అనుమానం, ఇంట్లో పనిచేయడం లేదని, మద్యం తాగడం, సెల్‌ఫోన్లు వంటివి కారణమవుతున్నాయి. తాము వారికి రెండు, మూడు దఫాలుగా కౌన్సిలింగ్ ఇచ్చి రాజీపడేందుకే ప్రయత్నిస్తాం.

సాక్షి: ఏ తరహా భార్యాభర్తల మధ్య గొడవలు వస్తున్నాయి ?

ఇన్‌స్పెక్టర్: ఉన్నత చదువులు చదువుకున్న భార్యాభర్తలే ఎక్కువగా గొడవ పడుతున్నారు. వివాహమైన 6 నెలల నుంచి 4 ఏళ్లుగా కాపురాలు చేస్తున్న భార్యాభర్తల కేసులే అధికంగా వస్తున్నాయి.

సాక్షి: మీరు ఎలాంటి కౌన్సిలింగ్ నిర్వహిస్తారు ?

ఇన్‌స్పెక్టర్: భార్యాభర్తల మధ్య వివాదానికి కారణాన్ని తెలుసుకుని దానికి పరిష్కార మార్గాలు చెబుతాం. వారి దృష్టిలో ఉన్న పెద్దసమస్యను చిన్నగా చూపెడతాం. గతంలో పెద్దలు సైతం సర్ది చెప్పేవారు. ప్రస్తుతం తల్లిదండ్రులు, పిల్లల గొడ వలను చల్లార్చకుండా ఆజ్యం పోస్తున్నారు. తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలి. దంపతులకు పిల్లలున్నా కొన్ని కేసుల్లో విడిపోవడానికి చూస్తున్నారు. ఇది బాధాకరం, బాధ్యతారహిత్యం.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వడ్డెరుల సదస్సులో మాట్లాడుతున్న శివరాత్రి ఐయిలి మల్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి ఐయిలి మల్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐయిలి మల్లు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు వడ్డెరులకు తగిన ప్రాధాన్యత కల్పించి రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. రాజకీయ పార్టీలు వడ్డెరులను గుర్తించకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వడ్డెర కులస్తులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వడ్డెర హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

- రాష్ట్రంలో సుమారు 40 లక్షలకు పైగా వడ్డెర కులస్తులున్నారని వారిని గుర్తించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.
- వడ్డెరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి చైర్మన్‌గా వడ్డెర వ్యక్తిని నియమించి వేయి కోట్లు కేటాయించాలని వడ్డెరులకు గురుకుల పాఠశాలల్లో అవకాశం కల్పించాలన్నారు.
- కాంట్రాక్టు పనుల్లో 25 శాతం ఈఎండీ లేకుండా ఇవ్వాలని క్వారీలపై 20 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.
- ప్రమాదవశాత్తు మరణించిన వడ్డెరులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర వైస్ చైర్మన్ గండికోటకుమార్, మహిళా అధ్యక్షురాలు శివరాత్రి ఉమా, ఉపాధ్యక్షులు శ్రీశైలం, వెంకటేష్, కోశాధికారి దండుగుల తిరుపతి, ప్రచార కార్యదర్శి వెంకటరమణ తదితరులున్నారు.

గొర్రెల ఫామ్‌లను ఏర్పాటు చేయాలని వినతి



మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: గొల్లకురుమలను ఆదుకునేందుకు తెలంగాణలో గొర్రెల ఫామ్‌లను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్‌సాగర్‌లతో కలిసి సోమవారం మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు ఇచ్చేలా బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్‌ను ఒప్పించాలని కోరారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం బీసీ బంధును ప్రకటించాలన్నారు. బీసీలోని కులవృత్తులకు ఇస్తున్న లక్ష రూపాయల పథకాన్ని కేవలం కొన్ని కులాలకే పరిమితం చేయకుండా బీసీల్లోని అన్ని కులాలకు వర్తించేలా చూడాలన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గుజ్జకృష్ణ, భూపేష్ సాగర్, నందగోపాల్, రాజ్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



లోక్‌రాజ్‌నీతి మంచ్ సదస్సులో మాట్లాడుతున్న వీజీఆర్ నారగోని

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చి బహుజన రాజ్యాధికారంకై ఉద్యమించాలని బహుజన ఉద్యమకారుడు వీజీఆర్ నారగోని పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లోక్‌రాజ్ నీతి మంచ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పౌరసమాజం మేధోమదన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీజీఆర్ నారగోని మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోతుందన్నారు. రాజ్యాంగ హక్కులను కూడా కాలరాస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. లోక్‌రాజ్ నీతి మంచ్ తెలంగాణ ఇన్‌చార్జ్ గోపాల్‌సింగ్, ప్రొఫెసర్ శ్యామ్‌గంబీర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సోషలిస్టు పార్టీ అధ్యక్షురాలు రచ్చ సుభద్రరెడ్డి, సీనియర్ అడ్వకేట్ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి



ఇందిరాపార్కు వద్ద జరిగిన ప్రదర్శనలో డాక్టర్ విశారదన్ మహరాజ్

కవాడిగూడ: రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. సోమవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద భారత రాజ్యాంగాన్ని బోధించాలని, భారత రాజ్యాంగాన్ని ప్రజలకు పంచాలని డిమాండ్ చేస్తూ.. ధర్నా, ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత సంస్కృతి అంటే భారత రాజ్యాంగం అని ప్రతి పౌరుడికి బోధించాలని సూచించారు. దేశంలో నివసిస్తున్న ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించి చైతన్యం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాస్‌యాదవ్, వరుణ్‌కుమార్, డీఎస్పీరాష్ట్ర నాయకులు రాఘవేంద్రముదిరాజ్, హరీష్‌గౌడ్, అబ్దుల్ రెహమాన్, లక్ష్మణ్, కృష్ణనాయక్, గణేష సాయిబాబా, రమేష్, రాజు, దుర్గాప్రసాద్, సంధ్యారాణి, సుమన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

సత్రం నిర్మాణానికి పార్టీలకతీతంగా సహకరించాలి

చిక్కడపల్లి: కొండగట్టు ఆంజనేయస్వామి మున్నూరు కాపు నిత్యాన్నదానసత్రం నిర్మాణానికి 10 గుంటల భూమిని ఆలయ పరిసర ప్రాంతంలో తీసుకున్నట్లు సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరె దశరథం ఓ ప్రకటనలో తెలిపారు. మున్నూరుకాపు ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా సహకారం అందించాలని కోరారు. కుల ఉద్యోగులు, విద్యావంతులు, మేధావులు, వ్యాపారవేత్తలు, కార్మికులు, కర్షకులు తమవంతు సహకారం అందించాలన్నారు. సత్ర నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని భూమిపూజ కార్యక్రమం ఈ ఏడాది సెప్టెంబర్ 4న జరుగుతుందని వివిధ రాష్ట్రాల నుంచి మున్నూరుకాపులు తరలిరావాలని కోరారు. రంగు గోపాల్, నిఖిల్, నారాయణ, అకిల్, శ్రీను, రాష్ట్ర మున్నూరుకాపు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆరె మహేందర్ పాల్గొన్నారు.

నేడు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సాధుసంత్‌ల సమావేశం

కాచిగూడ: విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 13న కాచిగూడ శ్యామ్‌మందిర్‌లో సాధుసంత్‌ల సమావేశం జరుగుతుందని వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పుప్పాల వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. హిందూ ధార్మిక విభాగాల నుంచి పూజ్యస్వామిజీలు, సాధువులు ఈ సమావేశంలో పాల్గొంటారని ఆయన వివరించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అఖిల భారత సాధుపరిషత్ ప్రధాన కార్యదర్శి పూజ్యశ్రీ జితేంద్రానంద సరస్వతీస్వామి జగద్గురు శంకరాచార్య, విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ కార్యదర్శి, ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ అశోక్‌కుమార్ తివారీ, వీహెచ్‌పీ జాతీయ నేతలు రాఘవులు, సత్యంజీ తదితరులు పాల్గొంటారన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తుల మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (50), మహిళ (35) యాకుత్‌పుర రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా తెలియలేదని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

భారతీయ కళాసంప్రదాయాలకు ప్రతీక



బిరుదు గ్రహీతలతో వాణీరమణ, వైఎస్ఆర్ మూర్తి

చిక్కడపల్లి: వైజ్ మెగా క్విన్ బిరుదు గ్రహీతలు భారతీయ కళాసంప్రదాయాలకు ప్రతీకలు అని జ్ఞానసరస్వతి సంగీత, నృత్య, సంస్థ చైర్మన్ వాణీ రమణ అన్నారు. వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వైజ్‌మెన్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని సంస్థల కార్యాలయంలో సోమవారం సాయంత్రం పలు రంగాల వారికి వైజ్ మెగా క్విన్ బిరుదులు ప్రదానం చేసి సత్కరించారు. వాణీ రమణ మాట్లాడుతూ.. బిరుదులు అందుకున్న మోడలింగ్, నృత్యం, యాంకరింగ్, సంగీతం తదితర రంగాలకు చెందిన సంధ్య, శ్రావ్య, మృదుల, దీపిక, శ్రీనివాసరావు, స్రవంతి, శ్రీలాస్య, సంధ్య, స్రవంతి శ్రీకార్, లక్ష్మి, ప్రయాగజ్యోతి, శైలజ, ప్రద్యుమ్నులు మరింత రాణించాలని ఆకాంక్షించారు. వైఎస్ఆర్‌మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో షహన, రాముగౌడ్ పాల్గొన్నారు.

పార్కు సుందరీకరణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ లావణ్య

కాచిగూడ: గోల్నాక డివిజన్ కృష్ణానగర్‌లో రూ.23 లక్షలతో పార్కు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కులో ప్రజలకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా వివిధ రకాల మొక్కలు నాటడం, వాకింగ్ ట్రాక్, నీటి సౌకర్యం, కొత్త బెంచీలు, పెయింటింగ్, టైల్స్, పిల్లలకు క్రీడా పరికరాలు తదితర వాటితో పాటు విద్యుత్ దీపాలు, ఆర్చ్, గేటు, పార్కు చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. స్థానిక యువత కోరిక మేరకు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక అధికారులు, వివిధ పార్టీల నేతలు తదితరులున్నారు.

నాలా నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లకుంట కూరగాయల మార్కెట్‌లోని స్మార్ట్‌మార్ట్ నుంచి శ్రీరామ్‌నగర్ బస్తీ వరకు జరుగుతున్న నాలా నిర్మాణపనులు, రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. సోమవారం ఆదర్శ వెల్ఫేర్ అసోసియేషన్, పద్మకాలనీ, బృందావన్ కాలనీ, అచ్చయ్యనగర్‌ల సంయుక్తాధ్వర్యంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. నాలా నిర్మాణ పనుల్లో జాప్యానికి గల కారణాలను బస్తీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పనులను త్వరితగతిన పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ నాయకులు సత్తయ్యగౌడ్, సాగర్‌రెడ్డి, బి.వెంకటస్వామిగౌడ్, సీతారాం తదితరులున్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో డివిజన్‌లోని పలు ప్రభుత్వ, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. దుర్గానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

పనివద్దు చదువే ముద్దు !

ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం



డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ తదితరులు

ముషీరాబాద్: ‘పని వద్దు చదువే ముద్దు’ అని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కృష్ణవేణిలు అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్, నవభారతి, ప్రకృతి లాయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని మొరంబొంద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సదస్సు నిర్వహించారు. బాల కార్మిక నిర్మూలన కోసం వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో, స్లమ్ ఏరియాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలన్ని బాల కార్మికులను అంతమొందించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 12న బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు, గొప్ప మానవతా విలువలు కలిగిన నాయకులు పుస్తకాలు, పోషకాహారం అందజేశారు. ప్రతి బిడ్డకు ఆరోగ్యం, విద్య, రక్షణ హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. బాల కార్మికుల నిర్మూలన కోసం అందరూ సహకరించడం అత్యవసరమన్నారు. జి.కృష్ణవేణి, ప్రిన్సిపాల్ వై.విజయ, టీచర్ ఎ.రమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహించడం అభినందనీయం

చిక్కడపల్లి: ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసిన మహిళలను ప్రోత్సహించడం అభినందనీయమని మత్స్య మహిళ సహకార సంఘం మాజీ చైర్మన్ కొప్పు పద్మ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలో మూడు రోజులపాటు జరిగిన ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్‌లో మహిళలను ప్రోత్సహించినందుకు మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరామ్ భూక్యా, హైదరాబాద్ జిల్లా మత్స్య అధికారి చరితకు ఆమె కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. చిక్కడపల్లి గంగపుత్ర(బెస్త) సంఘం అధ్యక్షులు గుండు జగదీశ్‌బాబు, గాంధీనగర్ మహిళ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పెద్దపల్లి సుజాత, గుండు ధనలక్ష్మి, అరుణ, వెంకటేష్, రాజ్‌కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ జిల్లా మత్స్య అధికారి చరితను సన్మానిస్తున్న దృశ్యం

బద్దెన సుమతీ శతక పద్యాలు నీతి బోధనలు



నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతిశర్మ, జనార్దనమూర్తి

చిక్కడపల్లి: పద్యాలతో కుటుంబ, సామాజిక విలువలు చాటిన బద్దెన సుమతీ శతక పద్యాలు నీతి బోధనలు అని సీబీఐ రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం శతాబ్ది పూర్వ మహనీయుల స్మరణలో పద్యకారుడు బద్దెన సంస్మరణ సమావేశం జరిగింది. నాగమారుతిశర్మ మాట్లాడుతూ.. 13వ శతాబ్దానికి చెందిన బద్దెన అసలు పేరు భద్ర భూపాలుడు అని కాకతీయ రుద్రమదేవి సామంత రాజుగా ఉండేవారని చరిత్రలో నమోదైందన్నారు. నాటి సామాజిక, రాజకీయ, కుటుంబ వ్యవస్థల ప్రభావం బద్దెన సుమతీ శతక పద్యాలపై ఉందని వివరించారు. నేడు పద్యాలు ప్రాథమిక విద్యాసంస్థలలో బోధించడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళాపోషకులు వెంకటరెడ్డి, గాయకులు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు, న్యాయవాది తోట శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వార్డు కార్యాలయానికి కృష్ణాపత్రిక భవనం కేటాయించండి



భవన స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి: మున్సిపల్ మార్కెట్ పక్కన నిరుపయోగంగా ఉన్న కృష్ణాపత్రిక స్థలాన్ని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. వార్డు కార్యాలయ ఏర్పాటుపై అధికారులు ఎదుర్కొంటున్న వ్యతిరేకత దృష్ట్యా దీన్ని కోరుతున్నామన్నారు. సోమవారం కృష్ణాపత్రిక భవనాన్ని జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలసి ఆమె పరిశీలించారు. మరమ్మతులతో భవనం ఉపయోగకరంగా ఉంటుందని పార్కింగ్ కూడా ఉందని మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్‌లకు వివరించామన్నారు. బీజేపీ నేతలు దామోదర్, రాజేందర్, బాలు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బీసీబంధు అమలు చేయాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో బీసీబంధును వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌరీశంకర్ కోరారు. సోమవారం అడిక్‌మెట్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధికోసమే బీసీలకు లక్ష ఆర్థిక సాయం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చిందన్నారు. ఈ పథకంతో మరోసారి బీసీలను మభ్యపెట్టి మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీసీ జాబితాలో 130 కులాలు ఉండగా.. కేవలం 14 కులాలకు మాత్రమే ఈ స్కీమ్‌ను వర్తింపజేయడం అన్యాయమని బీసీ జాబితాలోని అన్ని కులాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ దరఖాస్తు గడువును పొడగించాలని దరఖాస్తులో శరతులు కూడా అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. బీసీ కార్పొరేషన్‌లలో రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న సుమారు ఐదున్నర లక్షల దరఖాస్తులను వెంటనే ప్రాసెస్ చేయాలని వారందరికీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.